www.dainamicnews.com
శుభోదయ
దైనమిక్
ప్రజల కోసం - ప్రగతి కోసం
dianamicnews Tv
dianamicnews.epaper.com

విలేకరులు కావలెను
తెలుగు రాష్ట్రాలలో వెలువడుతున్న
దైనమిక్ దినపత్రికలో
అన్ని మండలాల వారీగా
విలేకరులు కావలెను.

దైనమిక్
CELL : 96523 03089

తెలంగాణ- ఏపి | సంపుటి : 1 | సంచిక : 175 | పేజీలు : 4 | ఎడిటర్ : పర్వతం పరమేష్ | గురువారం 22 అక్టోబర్ 2026 | వెల : 4/-

మహిళల భద్రతకు ప్రాధాన్యం

పోలీస్ శాఖలో 7,437 పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చాం
శాంతి భద్రతలు బాగుంటేనే రాష్ట్రంలో అభివృద్ధి వేగంగా ఉంటుంది
అమరవీరుల కుటుంబాల సంక్షేమానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుంది

"పోలీస్ శాఖను బలోపేతం చేసేందుకు ఈ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 4,773 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చాం. పోలీసుశాఖలో మొత్తం 7,437 పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చాం. మిగతా ఖాళీలను కూడా విడతల వారీగా భర్తీ చేస్తాం. 2028 నాటికి పోలీసుశాఖలో అన్ని ఖాళీలను భర్తీ చేస్తాం. పోలీసుశాఖలో ఎక్స్‌గ్రేషియాను హోదా ఆధారంగా రూ.కోటికి పైగా పెంచాం"

హైదరాబాద్

ప్రజల ప్రాణాలకు రక్షణగా నిలుస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులకు తెలంగాణ ప్రభుత్వం ఘనంగా నివాళులర్పించింది. వారి కుటుంబాలకు అండగా ఉంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. పోలీస్ అమరవీరుల కుటుంబాలకు అందించే పరిహారాన్ని భారీగా పెంచామని వెల్లడించారు. 2028 నాటికి పోలీస్ శాఖలో అన్ని ఖాళీలను భర్తీ చేస్తామని ప్రకటించారు. హైదరాబాద్ గోషామహల్ స్టేడియంలో జరిగిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమంలో మహిళా భద్రత, డ్రగ్స్ గంజాయి సైబర్ నేరాల కట్టడి, కల్తీ ఆహారంపై ప్రభుత్వ చర్యలపై సీఎం వివరాలు వెల్లడించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా హైదరాబాద్ గోషామహల్ స్టేడియంలో నిర్వహించిన పోలీస్ స్మారక పరేడ్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, - మిగతా3లో

ప్రైవేటు స్కూళ్లలో పేద పిల్లకు 25 శాతం సీట్లు

- అమలు చేసేందుకు వడివడిగా అడుగులు
- నిరుపేద పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో 25శాతం సీట్లు కేటాయించని నేపథ్యంలో సుప్రీం కోర్టు ఆగ్రహించింది
- ఈనేపథ్యంలో అమలుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

హైదరాబాద్

సమాజంలోని ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన పిల్లల కోసం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను కేటాయించే విషయంలో పురోగతి కనిపిస్తోంది. దశాబ్దాలు గడిచినా అనేక రాష్ట్రాలు ఈ నిబంధనను అమలు చేయకపోవడంపై సుప్రీంకోర్టు ఇటీవల 'జాతీయ బాలల హక్కుల పరిరక్షణ సంఘం' (ఎన్‌సీపీసీఆర్)పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నెల 27న జరగనున్న విచారణకు స్వయంగా హాజరై అమలు తీరుపై నివేదిక సమర్పించాలని సుప్రీంకోర్టు ఎన్‌సీపీసీఆర్‌ని ఆదేశిం చింది. ఈ నేపథ్యంలో ఎన్‌సీపీసీఆర్ - మిగతా3లో



డ్రగ్స్‌తో భావితరాలకు ముప్పు

- 2029 డిసెంబర్ 31 నాటికి భారత్‌ను డ్రగ్స్ రహిత దేశంగా మార్చమే మా లక్ష్యం
- దిల్లీలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో కేంద్ర హోంమంత్రి
- రానున్న మూడేళ్ల పాటు ఉమ్మడిగా పోరాడి మాదకద్రవ్యాల మహమ్మారిని దేశం నుంచి తరిమికొట్టాలని ఆయన పిలుపు

పల్లె జేబుకు ధరల చిల్లు!

- తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో సెప్టెంబర్‌లో 7.21 శాతానికి రిటైల్ ద్రవ్యోల్బణం
- దేశ సగటు గ్రామీణ ద్రవ్యోల్బణం 6.08 శాతంకన్నా ఎక్కువగా నమోదు
- ఉల్లి, టమాటా ధరలకు రెక్కలు.. నెల రోజుల్లోనే రెట్టింపు
- కూలీ రేట్లు పెరగక, వర్షాల్లేక పడిపోతున్న గ్రామీణుల కొనుగోలు శక్తి

హైదరాబాద్

పండుగల సమయంలో తెలంగాణ రాష్ట్రంలోని గ్రామీణ కుటుంబాలపై ధరల భారం రోజురోజుకూ పెరుగుతోంది. ఒకవైపు కూరగాయలు, నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతుంటే మరోవైపు కూలీ రేట్లు ఆ స్థాయిలో పెరగకపోవడం, వర్షాభావంతో పంటలు దెబ్బతినడం పల్లె ప్రజల కొనుగోలు శక్తిని దెబ్బతీస్తున్నాయి. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ (ఎంవోఎస్‌పీఐ) తాజాగా విడుదల చేసిన గణాంకాల ప్రకారం - మిగతా3లో

వచ్చే వారం కృష్ణా, గోదావరి యాజమాన్య బోర్డుల సమావేశం

- ఈనెల 26న కేఆర్ఎంబీ సమావేశం
- ఆ అంశాలపై చర్చ జరిగే అవకాశం
- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల మధ్య జలవివాదాలకు సంబంధించి వచ్చే వారంలో కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డులు సమావేశం కానున్నాయి.

హైదరాబాద్

తెలుగు రాష్ట్రాల నీటి అంశాలకు సంబంధించి వచ్చే వారం రెండు కీలక సమావేశాలు జరగనున్నాయి. కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డుల భేటీల్లో పలు కీలక అంశాలు చర్చకు రానున్నాయి. కృష్ణా జలాల్లో రెండు రాష్ట్రాల వాటాకు సంబంధించి ప్రధానంగా చర్చ జరగనుంది. ప్రాజెక్టుల అనుమతులకు సంబంధించిన పరస్పర ఫిర్యాదులు, పోలవరం, టెలీమెట్రీ పరికరాల ఏర్పాటు సహా ఇతర అంశాలు - మిగతా3లో

దిల్లీలో మళ్లీ వాయు కాలుష్యం

- అమల్లోకి వచ్చిన గ్రాఫ్ స్టేజ్1 ఆంక్షలు
- కాలుష్య నియంత్రణ చర్యలను ముమ్మరం చేయాలని అధికారులకు సూచించారు
- దిల్లీ-ఎన్‌సీఆర్ అంతటా గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జీఆర్ఏపీ) తొలి దశ అమలు చేశారు.

ఆందోళనలు హింసకు దారితీస్తాయి

- సీజేపీ నేతల కేసు విచారణలో ఫ్రాన్స్ అల్లర్లను ప్రస్తావించిన హైకోర్టు
- దిల్లీ హైకోర్టులో సౌరవ్ దాస్, ఆశుతోష్ రాంకాకు ఊరట లభించలేదు
- ప్రత్యామ్నాయ న్యాయ మార్గాన్ని ఆశ్రయించాలని హైకోర్టు సూచించింది.

అధికారుల దాడులను సైతం లెక్కచేయని అక్రమ వ్యాపారులు!

నేరేడుచర్లలో యథేచ్ఛగా బాణసంచా విక్రయాలు.. ప్రజల భద్రత గాలికి?

అక్రమ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలి.. సామాజికవేత్త చిల క రాజు నాగరాజు డిమాండ్

నేరేడుచర్ల, శుభోదయ డైనమిక్

నేరేడుచర్ల: పట్టణంలో బాణసంచా విక్రయాలు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నాయని, అధికారుల దాడులను సైతం లెక్కచేయకుండా వ్యాపారులు యథేచ్ఛగా టపాకాయలు అమ్ముతున్నారని సామాజికవేత్త చిలక రాజు నాగరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా, అగ్నిమాపక భద్రతా నిబంధనలు పాటించకుండా జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో బాణసంచా విక్రయాలు చేపడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

ఫిర్యాదులు చేసినా మారని పరిస్థితి

నేరేడుచర్ల పట్టణంలో అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తున్న వ్యాపారులపై స్థానిక పోలీస్‌స్టేషన్‌తో పాటు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు చిరాజు నాగరాజు తెలిపారు. తహసీల్దార్, పోలీస్, మున్సిపల్, అగ్నిమాపక శాఖల నుంచి అవసరమైన అనుమతులు పొందకుండా విక్రయాలు సాగిస్తున్నట్లు పేర్కొన్నారు.

దాడులు చేసినా ఆగని అమ్మకాలు

ఈ నెల 19న సాయంత్రం అగ్నిమాపక శాఖ అధికారులు, పోలీసు సిబ్బంది కలిసి నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా విక్రయిస్తున్న దుకాణాలపై తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. అయినప్పటికీ అక్టోబర్ 20న ఉదయం నుంచే అనుమతులు లేకుండా విక్రయాలు కొనసాగుతున్నాయని ఆరోపించారు.

ప్రజల భద్రతకు ముప్పు.. కఠిన చర్యలు తీసుకోవాలి

జనసమూహాల మధ్య బాణసంచా విక్రయాలు చేపట్టడం వల్ల అగ్ని ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని చిలక రాజు నాగరాజు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణను దృష్టిలో ఉంచుకుని సంబంధిత శాఖల అధికారులు

సమన్వయంతో తనిఖీలు నిర్వహించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అనుమతులు లేకుండా బాణసంచా విక్రయాలను తక్షణమే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఢిల్లీలో మళ్లీ వాయు కాలుష్యం

దేశ రాజధాని ఢిల్లీతో పాటు పరిసర ప్రాంతాల్లో వాయు కాలుష్యం మరోసారి ఆందోళన కలిగిస్తోంది. గాలి నాణ్యత సూచీ దిగజారడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కాలుష్య నియంత్రణ చర్యలను వేగవంతం చేసేందుకు ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలో గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జీఆర్‌ఏపీ) స్టేజ్-1ను తక్షణమే అమలు చేస్తున్నట్లు వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ (సీఏక్యూఎం) బుధవారం ప్రకటించింది. రానున్న రోజుల్లోనూ గాలి నాణ్యత ఇదే స్థాయిలో కొనసాగే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది.

ఒక్కరోజులోనే పెరిగిన కాలుష్యం

ఢిల్లీలో అక్టోబర్ 20న వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) 179గా నమోదైంది. ఇది 'మోస్తరు' కేటగిరీ పరిధిలోకి వస్తుంది. అయితే అక్టోబర్ 21న మధ్యాహ్నం 2 గంటలకు ఈ సూచీ 244కు చేరింది. దీంతో గాలి నాణ్యత 'పూర్' కేటగిరీలోకి వెళ్లింది. ఒక్కరోజు వ్యవధిలోనే కాలుష్య స్థాయులు గణనీయంగా పెరగడం అధికారులను అప్రమత్తం చేసింది. భారత వాతావరణ విభాగం (ఐఎండీ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియరాలజీ (ఐఐటీఎం) అంచనాల ప్రకారం, రానున్న రోజుల్లోనూ ఢిల్లీలో గాలి నాణ్యత 'పూర్' కేటగిరీలో కొనసాగే అవకాశాలున్నాయి. ఈ పరిస్థితిని సమీక్షించిన, భారత వాతావరణ శాఖ, ఇతర సంస్థలు కాలుష్యాన్ని మరింత పెరగకుండా నిరోధించేందుకు తొలి దశ చర్యలను అమలు చేయాలని నిర్ణయించింది.

జీఆర్‌ఏపీ స్టేజ్-1 ఎందుకు?

వాయు కాలుష్యం పెరుగుతున్నప్పుడు పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి దశలవారీగా చర్యలు చేపట్టే విధానమే గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్. గాలి నాణ్యత ఆధారంగా వివిధ దశల్లో నియంత్రణ చర్యలను అమలు చేస్తారు. ప్రస్తుతం ఢిల్లీలో ఏక్యూఐ 244కు చేరడంతో తొలి దశను అమల్లోకి తీసుకొచ్చారు. ఈ నిర్ణయం ఢిల్లీకి మాత్రమే పరిమితం కాకుండా మొత్తం జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్) పరిధిలో వర్తిస్తుందని సీఏక్యూఎం స్పష్టం చేసింది. సంబంధిత ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు, అమలు చేసే ఇతర విభాగాలు తమ పరిధిలోని చర్యలను పర్యవేక్షించాలని ఆదేశించింది. ఇప్పటికే అమల్లో ఉన్న కాలుష్య నియంత్రణ మార్గదర్శకాలను మరింత కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించింది. గాలి నాణ్యత మరింత దిగజారకుండా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని తెలిపింది. పౌరులు కూడా జీఆర్‌ఏపీ స్టేజ్-1లో సూచించిన మార్గదర్శకాలను పాటించాలని కోరింది.

పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తాం

ఢిల్లీతో పాటు ఎన్‌సీఆర్‌లో గాలి నాణ్యతను అధికారులు నిరంతరం గమనిస్తారని సీఏక్యూఎం తెలిపింది. వాయు కాలుష్య స్థాయులు, వాతావరణ శాఖలు వెల్లడించే భవిష్యత్ అంచనాలను బట్టి తదుపరి నిర్ణయాలు తీసుకుంటామని పేర్కొంది. అవసరాన్ని బట్టి అదనపు చర్యలపై సమీక్ష ఉంటుందని వెల్లడించింది. కాలుష్యాన్ని నియంత్రించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఈ ఆదేశాలు స్పష్టం చేస్తున్నాయి. జీఆర్‌ఏపీ తొలి దశ అమలుతో కాలుష్య నియంత్రణకు సంబంధించిన ప్రస్తుత చర్యలను ముమ్మరం చేయడంపై అధికారులు దృష్టి సారించనున్నారు.

గత పదేళ్లలో కాలుష్యం తీవ్ర సమస్య: మంత్రి

ఢిల్లీలో వాయు కాలుష్యంపై పర్యావరణ శాఖ మంత్రి మంజీందర్ సింగ్ సిర్సా ఆందోళన వ్యక్తం చేశారు. గత పదేళ్ల నుంచి 12 ఏళ్ల కాలంలో రాజధానిలో గాలి నాణ్యత తీవ్రంగా దెబ్బతిన్నదని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వాలు కాలుష్యానికి పంజాబ్, ఉత్తర్‌ప్రదేశ్, హరియాణా, రాజస్థాన్ వంటి రాష్ట్రాలను బాధ్యులుగా చూపుతూ వచ్చాయని, అయితే సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోలేకపోయాయని విమర్శించారు. అదే సమయంలో ప్రస్తుత ఏడాదిలో ఇప్పటివరకు 214 రోజులు 'గుడ్' లేదా 'మోడరేట్' కేటగిరీల్లో గాలి నాణ్యత నమోదైందని మంత్రి వెల్లడించారు. కొవిడ్ ప్రభావిత సంవత్సరాన్ని మినహాయించి చూస్తే, గత 12 ఏళ్లలో ఇదే అత్యధికమని పేర్కొన్నారు. ప్రభుత్వ చర్యలతో పాటు ఢిల్లీ ప్రజల సహకారం వల్లే ఈ ఫలితం సాధ్యమైందని తెలిపారు.

ఆందోళనలు హింసకు దారితీస్తాయి

ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ (ఎస్‌ఈఎం) జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపును సవాలు చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ నేతలు సౌరవ్ దాస్, అశుతోశ్ రాంకా దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు కీలక సూచనలు చేసింది. స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ వద్ద విచారణ పూర్తయ్యే వరకు వేచి చూడాలని పేర్కొంది. అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే అప్పీలేట్ కోర్టును ఆశ్రయించాలని జస్టిస్ సుబ్రమణియం ప్రసాద్ ధర్మాసనం సూచించింది. అలాగే ఫ్రాన్స్‌లో విద్యార్థుల ఆందోళనలు అగ్నిప్రమాదాలు, దోపిడీలకు దారితీసిన పరిణామాలను ఈ సందర్భంగా ప్రస్తావించింది. దీంతో సీజేపీ నేతలు హైకోర్టులో తమ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు.

సీజేపీ నేతలు సౌరవ్ దాస్, ఆశుతోశ్ రాంకాలను అక్టోబర్ 13న పోలీసులు అరెస్టు చేశారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసన చేపట్టే క్రమంలో వారు పోలీసుల బారికేడ్లను దాటి అక్కడికి ప్రవేశించినట్లు ఆరోపణలు ఉన్నాయి. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ నినాదాలు చేసినట్లు పేర్కొన్నారు. జంతర్‌మంతర్‌ను నిరసన ప్రదేశంగా గుర్తించిన అనుమతులను రద్దు చేసిన తర్వాత అక్కడికి వెళ్లడంపై పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తమ న్యాయ కస్టడీని పొడిగిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ సీజేపీ నేతలు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. వారి కస్టడీ గడువు బుధవారంతో ముగియున్న నేపథ్యంలో పిటిషన్?ను అత్యవసరంగా విచారించేందుకు న్యాయస్థానం అంగీకరించింది. అయితే ప్రత్యామ్నాయ న్యాయ మార్గాలను అనుసరించకుండా నేరుగా హైకోర్టును ఎందుకు ఆశ్రయించారని ధర్మాసనం ప్రశ్నించింది. సంబంధిత ఎస్‌ఈఎం విచారణ కోసం వేచి చూడాల్సిన అవసరాన్ని కూడా ప్రస్తావించింది. దీంతో పిటిషనర్లు తమ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు.

బారికేడ్లు దాటడంపై కోర్టు అభ్యంతరం

జస్టిస్ సుబ్రమణియం ప్రసాద్ నేతృత్వంలోని ధర్మాసనం నిరసనల నిర్వహణలో పోలీసుల అనుమతి ప్రాధాన్యాన్ని వివరించింది. జంతర్‌మంతర్ నిరసన ప్రదేశంగా గుర్తింపు కోల్పోయిన తర్వాత కూడా అక్కడికి వెళ్లాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించింది. బారికేడ్లను ఏర్పాటు చేయడం వెనుక నిర్దిష్టమైన ఉద్దేశం ఉంటుందని, వాటిని దాటడం వల్ల ఇతరులు కూడా ఆ ప్రాంతంలోకి ప్రవేశించే అవకాశం ఏర్పడుతుందని పేర్కొంది. నిరసనకారుల నియంత్రణలో లేని వ్యక్తులు అక్కడికి చేరితే పరిస్థితులు సంక్లిష్టంగా మారవచ్చని ధర్మాసనం అభిప్రాయపడింది. ఆందోళనకు సంబంధం లేని వారు ప్రవేశించి గందరగోళం సృష్టిస్తే, దాని ప్రభావం అసలు నిరసనకారులపైనా పడే ప్రమాదం ఉంటుందని సూచించింది. నిరసనలకు అనుమతి తీసుకోవడం అనేది ఆందోళనలను అడ్డుకోవడానికి మాత్రమే కాదని కోర్టు స్పష్టం చేసింది. ఇతరులు వచ్చి పరిస్థితులను చెడగొట్టకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడటం కూడా పోలీసుల అనుమతి విధానంలో కీలక ఉద్దేశమని వివరించింది.

ఫ్రాన్స్ అల్లర్లతో పోలిక ఎందుకు?

విద్యార్థుల ఆందోళనలుగా ప్రారంభమైన నిరసనలు హింసాత్మక ఘటనలకు దారితీసిన ఉదంతాలు దేశ సరిహద్దులకు పరిమితం కాలేదని హైకోర్టు పేర్కొంది. ఫ్రాన్స్‌లో విద్యార్థుల నేతృత్వంలో మొదలైన నిరసనలు చివరకు నిప్పంటించే ఘటనలు, దోపిడీలకు దారితీసిన పరిణామాలను ఉదాహరణగా ప్రస్తావించింది. నిరసన ప్రారంభమైనప్పుడు దాని ఉద్దేశం ఒకటిగా ఉన్నా, ఆ తర్వాత పరిస్థితులు మారే అవకాశం ఉంటుందని ధర్మాసనం అభిప్రాయపడింది. శాంతిభద్రతలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉన్నప్పుడు నిరసన నిర్వాహకులు ఎవరు? వారి అనుబంధ సంస్థ ఏమిటి? ఆ సంఘం లక్ష్యాలేంటి? అనే అంశాలు ప్రాధాన్యం సంతరించుకుంటాయని పేర్కొంది. అయితే, నిషేధం లేదా అనుమతి రద్దు చేసిన ప్రదేశంలో నిరసన చేపట్టడం ఎంతవరకు తీవ్రమైన చర్యగా పరిగణించాలనే అంశాన్ని కూడా కోర్టు ప్రస్తావించింది. బారికేడ్లు దాటి వెళ్లిన వ్యవహారంపై చట్టపరమైన అంశాలను ప్రత్యేకంగా పరిశీలిస్తామని తెలిపింది. నిరసన నిర్వహించిన తీరుపై అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ, ఆ చర్యల చట్టబద్ధతను పరిశీలించడం వేరే అంశమని ధర్మాసనం పేర్కొంది.

'మీరు జెన్-జెడ్ కాదు'

విచారణ సందర్భంగా సీజేపీ నేతల వయసును కూడా ధర్మాసనం అడిగి తెలుసుకుంది. సౌరవ్ దాస్ వయసు 26 ఏళ్లు కాగా, ఆశుతోశ్ రాంకా వయసు 31 ఏళ్లు. వారి వయసుల నేపథ్యంలో మీరు జెన్-జెడ్ తరానికి చెందినవారు కాదని వ్యాఖ్యానించిన న్యాయమూర్తి మిలీనియల్స్ ఏ వయో వర్గానికి చెందుతారని సరదాగా ప్రశ్నించారు. విద్యార్థుల ఉద్యమంగా మొదలైన నిరసన క్రమంగా వేరే స్వరూపం సంతరించుకుందనే విషయాన్ని కూడా కోర్టు ప్రస్తావించింది. నిరసనలో పాల్గొనే వ్యక్తులు మారకపోయినా, వారి ఆందోళనకు సంబంధించిన కారణాలు మారే అవకాశం ఉంటుందని అభిప్రాయపడింది. శాంతిభద్రతలకు భంగం కలిగే ప్రమాదం ఉందనే అనుమానం ఏర్పడినప్పుడు

కల్లూరు--సోమారం బీటీ రోడ్డుకు రూ.2.20 కోట్లు

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి పాలాభిషేకం

జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చలసాని శ్రీనివాసరావు

నేరేడుచర్ల, శుభోదయ డైనమిక్ న్యూస్ హుజూర్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విశేష కృషి చేస్తున్నారని జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చలసాని శ్రీనివాసరావు అన్నారు. నేరేడుచర్ల మండలం కల్లూరు నుంచి సోమారం వరకు రెండు కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.2.20 కోట్లు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం కల్లూరు గ్రామంలో మంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా చలసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కల్లూరు--సోమారం రహదారి అధ్వానంగా మారడంతో ప్రజలు, రైతులు, వాహనదారులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి మంత్రి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. కల్లూరు గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయించినందుకు గ్రామ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకుల తరపున మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్లూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుడిగె వెంకటేశ్వర్లు గౌడ్, ఉపసర్పంచ్ ఉప్పెల్లి మహేష్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ భద్రతను పరిరక్షించడంలో కేంద్రం విఫలం

మణిపూర్ హింసాకాండపై కాంగ్రెస్

మణిపూర్‌లో కొనసాగుతున్న హింసాకాండపై కాంగ్రెస్ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసింది. వ్యూహాత్మకంగా కీలకమైన సరిహద్దు రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడటంలో, రాజ్యాంగ హక్కులను పరిరక్షించడంలో, జాతీయ భద్రతను రక్షించడంలో బీజేపీ విఫలమైందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. ఇటీవల నలుగురు అమాయక పౌరులు హత్యకు గురికావడంపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మే 2023 నుంచి ఇప్పటివరకు 300 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, 24,530 మంది సహాయక శిబిరాల్లో దయనీయ పరిస్థితుల్లో జీవిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో శాంతిని పునరుద్ధరించేందుకు కేంద్రం తీసుకున్న చర్యలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

మళ్లీ రక్తసిక్తమైన మణిపూర్

మణిపూర్‌లో ఇటీవల జరిగిన హింసాకాండలో నలుగురు అమాయక పౌరులు దారుణంగా హత్యకు గురికావడాన్ని ఖర్గే ఖండించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బీజేపీ అసమర్థత వల్లే రాష్ట్రం మళ్లీ రక్తసిక్తమవుతోందని 'ఎక్స్' వేదికగా విమర్శించారు. మే 2023లో లోయ ప్రాంతానికి చెందిన మైతీ వర్గానికి, కొండ ప్రాంతానికి చెందిన కుకీ వర్గానికి మధ్య ప్రారంభమైన జాతి ఘర్షణలు రాష్ట్రాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టాయని పేర్కొన్నారు. ఈ హింసాకాండలో ఇప్పటివరకు కనీసం 306 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 49 మంది ఆచూకీ తెలియకుండా పోయిందని, వేలాది మంది నిరాశ్రయులయ్యారని తెలిపారు. ఈ ఘర్షణల ప్రభావాన్ని మహిళలు, పిల్లలు, బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలు ఇప్పటికీ ఎదుర్కొంటున్నాయని ఖర్గే అన్నారు. వేలాది మంది తమ ఇళ్లకు దూరంగా సహాయక శిబిరాల్లో జీవించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతిని నెలకొల్పడం, బాధితులకు భద్రత కల్పించడం, నిర్వాసితులను తిరిగి వారి నివాసాలకు చేర్చడం వంటి అంశాల్లో కేంద్రం బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.

మోదీ, అమిత్ షాకు మూడు ప్రశ్నలు

మణిపూర్ పరిస్థితులపై ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా మూడు కీలక ప్రశ్నలకు సమాధానం చెప్పాలని ఖర్గే డిమాండ్ చేశారు. జూన్ 2023లో అమిత్ షా ఏర్పాటు చేసిన శాంతి కమిటీకి ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతిని పునరుద్ధరించడానికి, పౌరులను రక్షించడానికి, భద్రతాపరమైన సవాళ్లను పరిష్కరించడానికి ఇప్పటివరకు తీసుకున్న నిర్దిష్ట చర్యలేమిటని నిలదీశారు. సుప్రీంకోర్టు నియమించిన జస్టిస్ గీతా మిట్టల్ కమిటీ సిఫార్సులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో వెల్లడించాలని కోరారు. సహాయక శిబిరాల్లో 31 అసహజ మరణాలు సంభవించినట్లు సుప్రీంకోర్టు వెల్లడించినప్పటికీ, వేలాది మంది ఇంకా ఎందుకు నిరాశ్రయులుగా ఉన్నారని ఖర్గే ప్రశ్నించారు. మహిళలు, పిల్లలు, నిర్వాసిత కుటుంబాల భద్రత, గౌరవం, పునరావాసం కోసం ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. మూడేళ్లకు పైగా కాలం గడిచినా పరిస్థితుల్లో ఆశించిన మార్పు రాలేదని విమర్శించారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించడం, ముఖ్యమంత్రిని మార్చడం, తిరిగి బీజేపీ ప్రభుత్వం ఏర్పడటం వంటి రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నా శాంతి నెలకొనలేదని ఖర్గే అన్నారు. హింస ప్రారంభమైన తర్వాత దాదాపు 29 నెలల పాటు మణిపూర్‌లో అడుగుపెట్టని ప్రధాని మోదీ, పార్లమెంటులో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో విఫలమయ్యారని ఆరోపించారు. ఇంతటి పాలనా వైఫల్యానికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. అమాయకుల ప్రాణాలు మరెన్ని కోల్పోతే కేంద్రం స్పందిస్తుందని నిలదీశారు. మణిపూర్‌కు న్యాయం, గౌరవం, రాజ్యాంగ హక్కులు, శాశ్వత శాంతి లభించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర భద్రత, స్థిరత్వాన్ని బీజేపీ తన రాజకీయ ప్రయోజనాల కోసం పణంగా పెట్టకూడదని హెచ్చరించారు. అలాగే మహిళా రిజర్వేషన్ల విషయంలో ప్రధాని మోదీ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఖర్గే ఆరోపించారు.

హుజూర్‌నగర్‌లో మహిళా హత్యపై పోలీసుల దర్యాప్తు.. శివాలయం వైపు డాగ్ స్క్వాడ్!

శుభోదయం డైనమిక్ న్యూస్, హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ పట్టణంలోని సుందరయ్యనగర్‌లో మహిళ హత్యకు గురైన ఘటన తీవ్ర కలకలం రేపింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. అనంతరం డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించి పరిసర ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తూ కీలక ఆధారాలను సేకరిస్తున్నారు. మహిళ వద్ద ఉన్న

బంగారు ఆభరణాల కోసమే హత్య జరిగి ఉండవచ్చనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఘటనాస్థలం నుంచి డాగ్ స్క్వాడ్ శివాలయం వైపు వెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. హత్యకు అసలు కారణం ఏమిటి? ఈ ఘటనలో ఎవరి ప్రమేయం ఉంది? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నిందితులను గుర్తించేందుకు ఆధారాలను సేకరిస్తూ అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నారు.

73 సంవత్సరంలో వృద్ధురాలని చంపి బంగారు పుస్తెలతాడును దొంగిలించిన దుండగులు.

శుభోదయ డైనమిక్ న్యూస్ హుజూర్ నగర్ : హుజూర్నగర్ లోని సుందరయ్య నగర్ నందు గల లక్ష్మయ్య రైస్ మిల్ దగ్గరలో గల వారి ఇంటి నందు నివసిస్తున్న మామిడి రాములమ్మ భర్త బ్రహ్మం వయసు 73 సంవత్సరాలు అను వృద్ధురాలు వారి ఇంటి నందు పడుకొని ఉండగా నిన్నటి రాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి ఆమెను చంపి ఆమె మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు పుస్తెలతాడును అపహరించుకుని వెళ్ళినారు. ఇట్టి విషయంపై ఆమె కొడుకు అయిన మామిడి నరసింహారావు ఫిర్యాదు మేరకు హుజూర్నగర్ ఎస్సై చలిగంటి నరేష్ కేసు నమోదు చేయగా హుజూర్నగర్ సిఐ జి చరమంద రాజు దర్యాప్తు చేయుచున్నారు.

25వ వార్డులో కనకదుర్గమ్మ శోభాయాత్రను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్



కోదాడ శుభోదయ డైనమిక్ వార్త అక్టోబర్ 21కోదాడ పట్టణ పరిధిలోని 25వ వార్డులో దేవి నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ట్రాక్టర్ పై ఏర్పాటు చేసిన అమ్మవారి శోభాయాత్రను లికోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా భక్తులు, స్థానిక యువకులు మాజీ ఎమ్మెల్యే గారికి ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అమ్మవారి శోభాయాత్ర వీధుల గుండా భక్తి శ్రద్ధలతో సాగింది.ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, భక్తులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నరసింహులగూడెం అభివృద్ధికి రూ.10 లక్షల నిధులు

సీసీ కెమెరాలు, సోలార్ వీధి దీపాల ఏర్పాటుకు ప్రతిపాదనలు

నరసింహులగూడెం, అక్టోబర్ 21 (శుభోదయ డైనమిక్ వార్త):సూర్యాపేట జిల్లా మునగాల మండలం నరసింహులగూడెం గ్రామ అభివృద్ధికి రూ.10 లక్షల నిధులు సమకూర్చేందుకు కృషి చేసిన గ్రామ సర్పంచ్ కుంచం ఇందిరా నరసయ్యకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ ద్వారా ఈ నిధులను తీసుకురావడానికి కృషి చేసినట్లు పేర్కొన్నారు.ఈ నిధుల్లో రూ.5 లక్షలతో సీసీ కెమెరాలు, మరో రూ.5 లక్షలతో సోలార్ వీధి దీపాల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించినట్లు తెలిపారు. గ్రామంలో భద్రతను మెరుగుపరచడంతో పాటు వీధుల్లో వెలుగులు నింపేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడనున్నాయి. గ్రామ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సర్పంచ్ కుంచం ఇందిరా నరసయ్య మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు కృషి చేయాలని గ్రామస్థులు ఆకాంక్షించారు.ం

నడిగూడెం--బృందావనపురం మధ్య రెండు బైకులు ఢీ

ప్రమాదంలో పలువురికి గాయాలు.. ఆసుపత్రికి తరలింపు

శుభోదయ డైనమిక్ న్యూస్ । నడిగూడెం:సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం నడిగూడెం--బృందావనపురం గ్రామాల మధ్య రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ప్రమాదం జరిగినట్లు సమాచారం. ఈ ఘటనలో గోపాలపురం, నడిగూడెం గ్రామాలకు చెందిన బైకర్లు గాయపడినట్లు తెలిసింది. ప్రమాదంలో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అయితే ప్రమాదం ఎలా జరిగింది, క్షతగాత్రుల పూర్తి వివరాలు, వారి ఆరోగ్య పరిస్థితిపై స్పష్టమైన సమాచారం తెలియాల్సి ఉంది.

బేకరీలో చోరీకి యత్నం అప్రమత్తమైన స్థానికులు.. బేకరీలో దొంగతనం యత్నం భగ్నం!

మేడ్చల్--మల్కాజిగిరి, అక్టోబర్ 21 శుభోదయ డైనమిక్ : స్థానికుల అప్రమత్తతతో బేకరీలో చోరీకి పాల్పడేందుకు ప్రయత్నించిన ఇద్దరు నిందితులు పోలీసులకు పట్టుబడ్డారు. బుధవారం తెల్లవారుజామున బలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికుల చొరవకు నిదర్శనంగా నిలిచింది.ఎబలానగర్ సీఐ ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. బలానగర్‌లోని నర్సాపూర్ క్రాస్‌రోడ్స్ సమీపంలో రవికుమార్‌కు చెందిన శివకుమార్ బేకరీలోకి తిరుపతి, పెంటారెడ్డి అనే ఇద్దరు వ్యక్తులు తెల్లవారుజామున ప్రవేశించారు. బేకరీ షట్టర్ తాళాలను పగులగొట్టి లోపలికి వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. అయితే, మూసి ఉన్న దుకాణంలో అనుమానాస్పద కదలికలను గమనించిన అటుగా వెళ్తున్న స్థానికులు వెంటనే అప్రమత్తమయ్యారు. చాకచక్యంగా వ్యవహరించి షట్టర్‌ను బయట నుంచి మూసివేసి, లోపల ఉన్న నిందితులు తప్పించుకోకుండా అడ్డుకున్నారు. అనంతరం బలానగర్ పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న నైట్ డ్యూటీలో ఉన్న బలానగర్ సీఐ ప్రశాంత్ తన సిబ్బందితో కలిసి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ ప్రశాంత్ స్థానికుల అప్రమత్తతను, సమయస్ఫూర్తిని అభినందించారు. ప్రజలు అనుమానాస్పద కార్యకలాపాలను గమనించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించడం ద్వారా నేరాల నియంత్రణలో కీలక పాత్ర పోషించవచ్చని ఆయన పేర్కొన్నారు.

అమెరికా పర్యటన ముగించుకుని స్వదేశానికి చేరుకున్న టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఈడ్పుగంటి సుబ్బారావుకు ఘన స్వాగతం

కాంగ్రెస్ యువ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికిన పార్టీ శ్రేణులు

శుభోదయ డైనమిక్ న్యూస్, హుజూర్ నగర్: అమెరికా విదేశీ పర్యటనను ముగించుకుని భారతదేశానికి తిరిగి విచ్చేసిన టీపీసీసీ జనరల్ సెక్రటరీ శ్రీ ఈడ్పుగంటి సుబ్బారావుకు కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు ఘన స్వాగతం పలికారు.ఎఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు సుబ్బారావుకు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాతో సత్కరించి ఆత్మీయంగా స్వాగతం పలికారు. ఆయన విదేశీ పర్యటన విజయవంతంగా ముగించుకుని స్వదేశానికి తిరిగి రావడం పట్ల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ టీపీసీసీ మీడియా అండ్ కమ్యూనికేషన్స్ రాష్ట్ర సమన్వయకర్త ఈడ్పుగంటి మోహన్తో పాటు కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా పనిచేయాలని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.

హత్యాయత్నం కేసులో నలుగురు నిందితులు రిమాండ్‌కు

వేపల సింగారంలో ఇద్దరిపై కత్తితో దాడి.. అరెస్ట్ చేసిన పోలీసులు

శుభోదయ డైనమిక్ న్యూస్ -- హుజూర్‌నగర్ రూరల్:హుజూర్‌నగర్ మండలం వేపల సింగారం గ్రామంలో ఇద్దరు వ్యక్తులపై కత్తితో దాడి చేసిన ఘటనలో నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ నెల 19న జరిగిన ఈ ఘటనలో సూరోజు మధుసూదనాచారి, సూరోజు భార్గవచారిలు గాయపడ్డారు.

ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఎస్ఐ సీహెచ్. నరేశ్ ఆధ్వర్యంలో నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. అనంతరం వారిని న్యాయస్థానంలో హాజరుపరచగా, కోర్టు రిమాండ్ విధించింది.

నిందితుల వివరాలు:

1. ధరావత్ మహేష్ (22) -- డ్రైవర్
2. తేజావత్ వంశీ (26) -- హార్వెస్టర్ డ్రైవర్
3. ధరావత్ కృష్ణ నాయక్ (42) -- కిరాణా వ్యాపారి
4. ధరావత్ శ్రీను నాయక్ (46) -- వ్యవసాయం

వీరంతా మిట్టగూడెం గ్రామానికి చెందినవారిగా పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటనపై తదుపరి దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిపారు.

రామాంజనేయ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా కనకదుర్గమ్మ అమ్మవారి ఊరేగింపు

శుభోదయం డైనమిక్ న్యూస్ హుజూర్‌నగర్ రూరల్ :
హుజూర్‌నగర్ మండల పరిధిలో రామాంజనేయ యూత్ ఆధ్వర్యంలో శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఊరేగింపును భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా యువత ఆధ్వర్యంలో నిర్వహించిన ఊరేగింపులో భక్తులు, గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అమ్మవారి నామస్మరణతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ మేకపోతుల వెంకన్న, 1వ వార్డు సభ్యుడు పెండెం మట్టపల్లి, టీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గండు సైదులు, మేకపోతుల శ్రీనివాస్, బత్తిని చిన్న గోపయ్య, తుమ్మలమట్టపల్లి రోశయ్య, పెండెం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు

తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో మైనార్టీ సోదరులకు ఆత్మీయ విందు

శుభోదయ డైనమిక్ న్యూస్, అక్టోబర్ 21, సూర్యాపేట : దసరా విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని సూర్యాపేటలోని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి నివాసంలో ముస్లిం, క్రైస్తవ సోదరుల కోసం దసరా వేడుకలు నిర్వహించి, ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం మతసామరస్యం, సోదరభావం, ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. ఈ సందర్భంగా పటేల్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ దసరా పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని, ప్రతి ఒక్కరూ ప్రేమ, శాంతి, సౌభ్రాతృత్వంతో జీవించాలని ఆకాంక్షించారు. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరినీ గౌరవించుకుంటూ, పరస్పర ప్రేమాభిమానాలతో ముందుకు సాగినప్పుడే సమాజంలో నిజమైన ఐక్యత సాధ్యమవుతుందని పేర్కొన్నారు. భిన్నత్వంలో ఏకత్వానికి సూర్యాపేట నిదర్శనం అని, అన్ని మతాల ప్రజలు సోదరభావంతో కలిసి మెలిసి జీవించడం మన ప్రాంత ప్రత్యేకత అని తెలిపారు. పండుగలు కేవలం ఆచారాలకే పరిమితం కాకుండా, మనుషుల మధ్య ఆత్మీయతను పెంపొందించి, ఐక్యతను బలోపేతం చేయాలని అన్నారు. అన్ని మతాల పండుగలను గౌరవిస్తూ, ప్రతి ఒక్కరితో ఆత్మీయ సంబంధాలను కొనసాగించడం మన సంస్కృతిలో భాగమని పేర్కొంటూ, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.

కాప్రా లాడ్జిలో యువకుడు ఆత్మహత్య

కుషాయిగూడ , అక్టోబర్ 21 శుభోదయ డైనమిక్ : కాప్రా లాడ్జిలో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం కర్నూలు స్వస్థలానికి చెందిన అనుపట్ల వీరేష్ ఆటో డ్రైవర్ జీవనోపాధి పొందుతూకుటుంబంతో కలిసి మధురానగర్ వాయుపురి కాలనీలో నివసిస్తున్నారు. ఇతని కుమారుడు అనుపట్ల కిరణ్ (21) డ్రైవర్ కం డెలివరీ బాయ్ గా పనిచేస్తున్నాడు. అయితే అనుపట్ల కిరణ్ ఈ నెల 18వ తేదీన కమలానగర్లోని ఆర్ 2 ఓయో లాడ్జిలో 401 రూమ్ లో బస చేశాడు. మరుసటి రోజు 19వ తేదీన రూమ్ క్లీనర్ తలుపు కొట్టిన తీయలేదు. అనుమానంతో మరో మాస్టర్ కి తో తలుపు తెరిచి చూడగా రూమ్ లో సీలింగ్ ఫ్యాన్ కు ఉరివేసుకొని వేలాడుతూ కనిపించాడు. దీంతో లాడ్జి యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు వచ్చి మృతుడి వివరాలను సేకరించారు. ఈ క్రమంలో మృతుడి తండ్రికి విషయాన్ని తెలియజేశారు. కాగా కిరణ్ రెండు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకొని ఇంటికి రాగా ఇంట్లోకి అనుమతించలేదు. దీంతో కిరణ్ తన భార్యతో ఆర్థిక సమస్యలు లేక ప్రేమ వివాహంతో ఏర్పడిన పరిస్థితుల కారణంగా మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు, కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేసున్నారు. ఈ మేరకు మృతుని తండ్రీ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

ఎంపిటీసీ స్థానానికి తొలి నామినేషన్ దాఖలు చేసిన సౌజన్య.

కారంపూడి, అక్టోబర్ 21, (పల్నాడు జిల్లా) శుభోదయ డైనమిక్ వార్త : - రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా కారంపూడి మండల ప్రజా పరిషత్ కు తొలి రోజు బుధవారం ఎంపీటీసీ సభ్యురాలుగా గొర్రెమర్రి సౌజన్య భర్త సాంబశివరావు చిన్నగార్లపాడు ప్రాదేశిక నెంబర్ కు తెలుగుదేశం పార్టీ తరపున తొలి నామినేషన్ పత్రాలను కారంపూడి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె వి యన్ ఉపేంద్ర కు అందజేశారు. అలాగే మండలంలోని చింతపల్లి గ్రామానికి చెందిన గవిడి శ్రీనివాసరావు తండ్రి సత్యనారాయణ తెలుగుదేశం పార్టీ తరపున రెండవ నామినేషన్ను దాఖలు చేశారు. వరుసగా మూడు రోజులు పండగ సెలవులు వచ్చినందున నామినేషన్లు దాఖలు చేయడానికి కావలసిన సర్టిఫికెట్లు పొందటం ఆలస్యం అయినందున, తొలి రోజు కేవలం రెండు నామినేషన్లు మాత్రమే వేయగలిగినట్లుగా తెలియవస్తుంది. రెండవ రోజు అయిన ఈరోజు అధిక సంఖ్యలో నామినేషన్లు వేయవచ్చని ఊహాగానాలు నడుస్తున్నాయి. ఏది ఏమైనా ఎటువంటి ఘర్షణలు, గొడవలు జరగనివ్వకుండా కారంపూడి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆవుల భాస్కర్, ఎస్సై వాసు తమ సిబ్బందితో శాంతి భద్రతలను కాపాడుతూ పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేసి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగనివ్వకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసి తొలిరోజు నామినేషన్ల ప్రక్రియను విజయవంతం చేశారు. ఈ నామినేషన్ల ప్రక్రియలో డిప్యూటీ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా గంటా శ్రీనివాస్ రెడ్డి మరియు మండల అభివృద్ధి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల రక్షణలో పోలీసుల సేవలు అభినందనీయం:

జిల్లా గవర్నర్ కళ్లెం కృష్ణారెడ్డి, కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ ఎల్. భాస్కర్ రెడ్డి

మేడ్చల్- మల్కాజ్ గిరి, అక్టోబర్ 21 శుభోదయ డైనమిక్ : ప్రజల ప్రాణ, ఆస్తుల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు, సేవలు ఎన్నటికీ మరువలేనివని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా 320ఐ జిల్లా గవర్నర్ లయన్ కళ్లెం కృష్ణారెడ్డి పేర్కొన్నారు.

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా 320ఐ ఆధ్వర్యంలో కుషాయిగూడ పోలీసులను సన్మానించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా గవర్నర్ కళ్లెం కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో చైనా సైనికుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన పది మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది త్యాగాలకు గుర్తుగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ ప్రజల భద్రత కోసం రాత్రింబవళ్లు నిద్రాహారాలు లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్న పోలీసుల సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించి గౌరవించాలని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర ఎంతో కీలకమని, వారి సేవలు సమాజానికిస్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.కుషాయిగూడ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎల్. భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, పోలీసుల సేవలను గుర్తించి వారిని సన్మానించిన లయన్స్ క్లబ్ ప్రతినిధులను అభినందించారు. సమాజ సేవలో ముందుండే లయన్స్ క్లబ్ చేపడుతున్న కార్యక్రమాలు ప్రశంసనీయమని, భవిష్యత్తులో నిర్వహించే సేవా కార్యక్రమాలకు పోలీసుల తరపున తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.

అనంతరం కుషాయిగూడ పోలీస్ స్టేషన్ సిబ్బందిని లయన్స్ క్లబ్ జిల్లా ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్రైమ్ ఇన్స్పెక్టర్, చర్లపల్లి ఇన్చార్జి ఎస్హెచ్ఓ వెంకటేశ్వర్లు గౌడ్,సబ్ ఇన్‌స్పెక్టర్లు వెంకన్న, సాయిలు, విజయ్, లయన్స్ క్లబ్ జిల్లా 320ఐ మొదటి వైస్ జిల్లా గవర్నర్ లయన్ డాక్టర్ మండా సురేష్ కుమార్, రెండవ వైస్ జిల్లా గవర్నర్ లయన్ గుంటక శేఖర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి లయన్ మోహన్ రెడ్డి, కోశాధికారి లయన్ శ్రీనివాస్ రావు, జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ గుడిగంటల రాములు, ప్రోగ్రామ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ లయన్ శేఖర్ మోరే, జోన్ చైర్‌పర్సన్ లయన్ వడ్లోజు జ్యోతిర్మయాచారి, ్రూు ఫోరం కోఆర్డినేటర్ లయన్ నాంపల్లి రూపా రెడ్డి, మాజీ కార్పొరేటర్ పావని రెడ్డి, లయన్ నాంపల్లి సుధాకర్ రెడ్డి, అంజిరెడ్డి, లక్ష్మీమూర్తి, నాగన్న, దత్తు, పెద్ది నాగరాజు, కృష్ణవేణి, రాఘవరెడ్డి, కలకొండ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్ చైర్మన్ తెలంగాణ (మాస్ కమ్యూనికేషన్స్) నియమితులైన మల్లిఖార్జున్ కు కొరటికల్ లో ఘన సన్మానం.

మేడ్చల్ -మల్కాజ్ గిరి అక్టోబర్ 21 శుభోదయ డైనమిక్ : హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్ నూతన చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన మల్లికార్జున్ కి తన సొంత ఊరు కొరటికల్ గ్రామంలో బుధవారం ఘన సన్మానం చేశారు. గ్రామ సర్పంచ్ కట్టేకోలా సుశీల హనుమంతు గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మల్లికార్జున్ ని శాలువాతో సత్కరించి, అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, మల్లికార్జున్ నియామకం మానవ హక్కుల పరిరక్షణ మరియు సామాజిక న్యాయం చేకూర్చడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.దేశవ్యాప్తంగా సామాజిక చైతన్యం పెంచడానికి వారి అనుభవం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. తనకు లభించిన ఈ గౌరవానికి మల్లికార్జున్ ధన్యవాదాలు తెలుపుతూ. ఈ అవకాశాన్ని కల్పించిన జాతీయ అధ్యక్షులు మెహతాబ్ రే కి మరియు సగ్గ వేణుమాధవ్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్, జితేందర్ సింగ్ రాణా స్టేట్ జనరల్ సెక్రెటరీ, డాక్టర్ కొమ్ము వెంకన్నబాబు తెలంగాణ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, సి హెచ్ రమణారెడ్డి స్టేట్ చైర్మన్ సోషల్ సర్వీసెస్ కి ధన్యవాదాలు తెలియజేస్తూ కమిషన్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించడం ఒక పెద్ద బాధ్యత అని, దీనిని విజయవంతంగా నిర్వహించడానికి అందరి సహకారం అవసరమని అన్నారు. పౌరుల హక్కులను కాపాడటం మరియు సామాజిక అన్యాయాలను అరికట్టడం తన ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన ప్రముఖులు గ్రామ సర్పంచ్ కట్టెకోల సుశీల హనుమంతు గౌడ్, ఉప సర్పంచ్ మామిడి నర్సిరెడ్డి, ఎక్స్ ఎంపీటీసీ కందటి అనంతరెడ్డి, చేనేత సహకార సంఘం చైర్మన్ శ్రీరాముల భావనాఋషి, పాల ఉత్పత్తిదారుల సంఘం ఎక్స్ చైర్మన్ కందటి దశరథరెడ్డి, శాలివాహన సంఘం రాష్ట్ర నాయకులు నరుకుడు బిందెల అంజయ్య, ఎలిమినేటి మహేష్, చామకూర ఉపేందర్, చుంచు నాగరాజు, కట్టెకోల అబ్బ సాయిలు, కట్టెకోల రవి, జంపాల బుచ్చయ్య, దుబ్బోల్ల యాదయ్య మరియు స్థానిక నాయకులు, మహిళలు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అభినందనలు తెలియజేశారు

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన వీరులకు కుషాయిగూడ సి ఐ భాస్కర్ రెడ్డి ఘన నివాళి

మేడ్చల్--మల్కాజిగిరి, అక్టోబర్ 21 శుభోదయ డైనమిక్:పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కుషాయిగూడ సీఐ, ఎల్ భాస్కర్ రెడ్డి విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు చేస్తున్న సేవలు, వారి త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని ఆయన పేర్కొన్నారు.

ఈ సందర్భంగా సీఐ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. పోలీసులు అనేక సవాళ్లను ఎదుర్కొంటూ శాంతిభద్రతలను కాపాడటంతో పాటు నేరాల నియంత్రణ, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ కోసం నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసుల ధైర్యసాహసాలు, అంకితభావం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. ప్రజల భద్రత కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందించిన పోలీసు అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. సమాజంలో శాంతి, భద్రతలను నెలకొల్పడంలో పోలీసు శాఖ పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం చరిత్రను వివరిస్తూ.. 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో చైనా సైనికులతో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారి కరం సింగ్ నేతృత్వంలో గస్తీ నిర్వహిస్తున్న కేంద్ర రిజర్వ్ పోలీసు దళం (సీఆర్‌పీఎఫ్)కు చెందిన పది మంది సిబ్బంది వీరమరణం పొందారని గుర్తుచేశారు. వారి త్యాగానికి గుర్తుగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అమరుల త్యాగస్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని ప్రజాసేవలో మరింత అంకితభావంతో పనిచేయాలని పోలీసు సిబ్బంది సి ఐ సూచించారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన వీరుల ఆశయాలను

కొనసాగిస్తూ ప్రజల రక్షణకు పోలీసు శాఖ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.

ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు సాగునీరు విడుదల చేయాలి!

ఎల్34, ఎల్35, ఎల్36 లిఫ్టుల ద్వారా తక్షణమే నీరు విడుదల చేయాలి

మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ డిమాండ్

శుభోదయ డైనమిక్ న్యూస్ -- నడిగూడెం: నడిగూడెం మండల ఆయకట్టు రైతులకు తక్షణమే సాగునీరు అందించి, ఎండిపోతున్న పంటలను కాపాడాలని డిమాండ్ చేస్తూ కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, రైతులు నీటిపారుదల శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఎల్34, ఎల్35, ఎల్36 లిఫ్టుల ద్వారా వెంటనే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నీటిపారుదల శాఖ ఉప కార్యనిర్వాహక ఇంజనీర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బొల్లం మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ.. అప్పులు చేసి పంటలు సాగు చేసిన రైతులకు సకాలంలో నీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. నడిగూడెం ఆయకట్టు రైతులు సాగునీటి కోసం ఎదురుచూస్తుంటే, నాగార్జునసాగర్ నీటిని ఖమ్మం జిల్లా పాలేరు ప్రాంతానికి తరలిస్తున్నారని ఆరోపించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెంటనే స్పందించి రైతుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.చెరువులు నిండే వరకు సాగర్ నీటి విడుదల కొనసాగించి ఆయకట్టు రైతులకు

న్యాయం చేయాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. రైతుల ప్రయోజనాల కోసం ఏర్పాటు చేసిన లిఫ్టుల ద్వారా నీటిని విడుదల చేయడంలో జాప్యం ఎందుకని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో రైతులకు మేలు చేసే చర్యలు చేపట్టాలని, అందుబాటులో ఉన్న సాగునీటి వనరులను సమర్థంగా వినియోగించి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నల్గొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల మండల పరిధిలో ఘనంగా అమ్మవారి ఊరేగింపు

ఆధ్యాత్మిక శోభతో అంగరంగ వైభవంగా సాగిన అమ్మవారి ఊరేగింపు

శుభోదయ డైనమిక్ న్యూస్ -- నేరేడుచర్ల: నేరేడుచర్ల మండల పరిధిలో అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, మంగళ వాయిద్యాలు, భక్తుల జయజయధ్వానాల మధ్య అంగరంగ వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

ప్రజలకు నిబద్ధతతో సేవ చేయడమే వారికి నిజమైన నివాళి: ఎస్పీ కె. నరసింహ

శుభోదయ డైనమిక్ న్యూస్ -- సూర్యాపేట బ్యూరో పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని, వారి సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని సూర్యాపేట జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన 154 మంది పోలీసు అమరవీరుల పేర్లను చదివి వినిపించారు.ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ కోసం పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని ఎస్పీ పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లాలో విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు వీరుల సేవలను స్మరించుకుంటూ, వారి ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు న్యాయం చేయాలని పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల కుటుంబాలకు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.ప్రజలకు నిబద్ధతతో సేవలందించడం, బాధితులకు న్యాయం చేయడం, చట్టాన్ని గౌరవిస్తూ శాంతిభద్రతలను కాపాడటమే అమరవీరులకు నిజమైన నివాళి అని అన్నారు. సైబర్ నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ, మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసులు నిరంతరం కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు, ఇతర శాఖల అధికారులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం: కలెక్టర్, ఎస్పీ

శుభోదయ డైనమిక్ న్యూస్ -- నల్లగొండ: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో పాటు అధికారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల రక్షణ కోసం పోలీసులు చేస్తున్న సేవలు అభినందనీయమని, అమరవీరుల ధైర్యం, కర్తవ్యనిష్ఠ యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు.ఎస్పీ మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో విధి నిర్వహణలో ఇప్పటివరకు 15 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది అమరులయ్యారని తెలిపారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసుల సేవలను ఎప్పటికీ మరువలేమని పేర్కొన్నారు.కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్, డీఎస్పీ శివరాం రెడ్డి, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

EDITOR & PUBLISHER : PARVATHAM PARAMESH, PLACE OF PUBLICATION : 4-68, LAL LAXMI PURAM, KALLURU, MEDARAM NEREDCHARLA RAOD, SURYAPET,TELANGANA - 508218.
PRINTER : LAXMI NARAYANA KARNATI, RATNA GRAPHICS, PRINTING PRESS (NAME & ADDRESS) 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPPOSITE POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013. TGTEL/26/A2416, SHUBODHAYA DYNAMIC VAARTA